## క్లుప్తంగా

### నీటి ఎద్దడి పరిష్కరించాలని వినతి



కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న ప్రకాశ్

నారాయణఖేడ్: నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా దిశ కమిటీ సభ్యుడు ప్రకాశ్ రాథోడ్ కోరారు. కలెక్టర్ వల్లూరు క్రాంతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి, ఇర్పల్లి, శాంతినగర్‌తండాలలో తాగునీటి కొరత ఉందన్నారు. కంగ్టి మండలంలోని చౌకాన్‌పల్లి తోపాటు అనేక గ్రామాలల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదని వాపోయారు. ప్రజలు వ్యవసాయ క్షేత్రాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారని, నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఏకగ్రీవ ఎన్నిక

పటాన్‌చెరు: నియోజకవర్గ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం అయింది. గురువారం పటాన్‌చెరు పట్టణంలో నియోజకవర్గంలో పనిచేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు పటాన్‌చెరు టీఎన్జీఓ అధ్యక్షులు, కార్యదర్శులు (ఎన్నికల అధికారులు) ప్రమోద్ కుమార్, విశ్వేశ్వర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యాంరావు, సహాయ అధ్యక్షుడిగా మహ్మద్ మొయినొద్దీన్, కార్యదర్శి అబెల్, కోశాధికారి రామ్ బహదూర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### పేదింటి ఆడపడుచు వివాహానికి సాయం

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన ఖాజా మియా పేదరికం కారణంగా తన కూతురి వివాహం చేయడానికి పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని ముస్లిం కమిటీ బాధ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. కమిటీ కార్యాలయంలో గురువారం రూ.12 వేలతో పాటు క్వింటాలు బియ్యాన్ని ఖాజామియాకు అందజేశారు. కమిటీ బాధ్యులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆసరాగా నిలవడమే తమ ఉద్దేశ్యమన్నారు. కమిటీ బాధ్యులు వసీంకతీబ్, హసం, నొమాన్, మెహరాజ్, ముక్రమ్‌ఖాన్, ఇసాక్, యూసుఫ్, ఇమ్రాన్ తెలిపారు.

### ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న మశ్చందర్ తదితరులు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని మద్రోస్ కుంటతండాలో గురువారం సేవాలాల్ మహారాజ్, భవానీమాత విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్, నిజాంపేట్ ఎంఈఓ రాములునాయక్, శంకర్, రాంసింగ్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

### మహిళలకు స్కూటీల పంపిణీ



స్కూటీలను అందజేస్తున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలకు గురువారం ఎలక్ట్రిక్ స్కూటీలు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలు కుమార్ యాదవ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### భవనం కూల్చివేత



నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసిన అధికారులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని సెట్టి గుంట చెరువు భూమి పరిధిలో నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఈసందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతం సెట్టిగుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని, ఇక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. అనుమతి లేని నిర్మాణాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# స్వావలంబనతో మహిళా 'వికాసం'

- కుట్టు మెషీన్ల ఉచిత పంపిణీకి సర్వం సిద్ధం
- ఇప్పటికే 500 మెషీన్ల పంపిణీ
- ఈనెల 17న మరో 240 మందికి..
- మహిళల సాధికారతకు వికాస్ సంస్థ కృషి



మహిళలకు కుట్టు మెషీన్ పంపిణీ చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి(ఫైల్)

జహీరాబాద్ టౌన్: ఖర్చులు పెరగడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో కుటుంబంలోని మహిళలు ఉపాధి అవకాశాలు వెతుక్కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్(వికాస్) సంస్థ మహిళలకు చేయూతనిచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఉపాధి కోసం కుట్టు శిక్షణనిచ్చి ఉచితంగా కుట్టు మెషీన్లను అందజేస్తోంది. ఇప్పటికే 500 మందికి నిరుపేద మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణనిచ్చి మెషీన్లను పంపిణీ చేసింది. ప్రస్తుతం మరో 240 మంది మహిళలకు శిక్షణనిస్తోంది. ఈనెల 17న వీరందరికీ ఉచితంగా మెషీన్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. జహీరాబాద్ పట్టణానికి చెందిన బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఈ వికాస్ సంస్థను ఏర్పాటు చేశారు. సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**ఒక్కో కేంద్రంలో 60 మంది**

జహీరాబాద్ నియోజకవర్గంలోని పట్టణంతోపాటు న్యాల్‌కల్, పస్తాపూర్, కోహీర్, మొగుడంపల్లి తదితర మండలాల్లో పలు గ్రామాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో సుమారు 60 మందికి శిక్షణనిస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలోని కేంద్రంలో 90 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. ప్రతీ కేంద్రంలో ఇద్దరు చొప్పున ట్రైనర్లు 90 రోజులపాటు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా క్లాస్‌లు తీసుకుంటున్నారు. వికాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాలను ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివ్ కౌన్సిల్ అధికారులు ప్రకాశ్, కో–ఆర్డినేటర్ సత్యంలు పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

**కోల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సహకారంతో...**

జహీరాబాద్ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కోల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సహకారంతో మహిళా సశక్తీకరణ –నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు కుట్టు పనిలో నైపుణ్యం సాధించేలా ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. రెండు బ్యాచ్‌లకుగాను ఇప్పటి వరకు 500 మంది వరకు టైలరింగ్‌లో శిక్షణనిచ్చి ఉచింతంగా కుట్టుమెషీన్లను పంపిణీ చేశారు. మూడవ విడత శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. నాలుగు కేంద్రాల్లో 240 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు.

**వికాస్ సంస్థకు రుణపడి ఉంటా**



టైలరింగ్‌కు సంబంధించి శిక్షణ చాలా బాగా ఇచ్చారు. ఇద్దరు ట్రైనర్లా నేర్పించారు. ట్రైనింగ్‌లో కుట్టుకు సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకున్నాను. ఉచిత శిక్షణతో పాటు ఉచితంగా కుట్టుమెషీన్ కూడా ఇచ్చారు. వికాస్ సంస్థ వారికి రుణపడి ఉంటా.

– మాలశ్రీ,పస్తాపూర్

**మహిళ సంక్షేమం కోసం కృషి**



మహిళల సంక్షేమ కోసం వికాస్ సంస్థ కృషి చేస్తోంది. పేద మహిళలను ఎంపిక చేసి వారికి శిక్షణనిచ్చి మెషీన్లను పంపిణీ చేస్తున్నాం. రెండు బ్యాచ్‌లకుగాను 500 మందికి ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశాం. 240 మందికి ట్రైనింగ్ ఇస్తున్నాం.

–కొత్తకాపు సురేందర్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్

# ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రశంసాపత్రంతో మొగిలిమాల

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మొగిలిమాల గురువారం అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని కవితను వినిపించారు. కవిత రచనను అభినందిస్తూ నిర్వాహకులు, ముఖ్య అతిథి మాజీ అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, రిటైర్డ్ జడ్జి మధుసూదన్‌రావులు ప్రశంసాపత్రాన్ని అందించి సన్మానించారు.

## ఝరాసంగంలో భారీ వర్షం



చెక్ డ్యాంలో నిలిచిన వర్షపు నీరు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు పలు గ్రామాలలో వేకువ జామున సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. అకాల వర్షానికి చేతికొచ్చిన మామిడికాయలు నేలరాలాయి. రోడ్డు కిరువైపులా ఉన్న గుంతలు చెక్ డ్యాం లలో భారీగా వర్షం నీరు నిలిచింది. పలుచోట్ల చెక్ డ్యాంల నుంచి నీరు పొంగిపొర్లింది.

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం



కన్‌సాన్‌పల్లి గ్రామంలో వర్షపు నీటి నుంచి ధాన్యాన్ని వేరుచేస్తున్న రైతులు

వట్‌పల్లి(అందోల్): రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దయింది. బుధవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి అందోలు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై, ఖాళీ స్థలాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని నీటిలో నుంచి వేరుచేయడానికి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు.

## ప్రతిభకు పురస్కారం



ప్రశంసా పత్రాలతో చేగుంట మోడల్ పాఠశాల విద్యార్థులు

మండల కేంద్రమైన చేగుంటలోని మోడల్ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. ఇటీవల పదోతరగతి పరీక్షల్లో మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీనిధి, కార్తిక్, చైత్రశ్రీ, సహస్రారెడ్డి, భువనేశ్వరీ, వర్ష, రసజ్ఞ, రిషికలు మండల స్థాయి టాపర్లుగా నిలిచారు. వీరంతరికీ కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారని వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాలకు సైతం ప్రశంసా పత్రం అందించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఒకే పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు టాపర్లుగా నిలవడం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

– చేగుంట(తూప్రాన్)

### రేపు వెంకటేశ్వరస్వామి కల్యాణం

నారాయణఖేడ్: మండల పరిధిలోని హన్మంత్ రావుపేట వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు భక్త మార్కండేయ ఆలయం నుండి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పుస్తే మట్టెలు, స్వామి వారి వస్త్రాల ఊరేగింపు ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### బాణాపూర్‌లో కొనసాగిన సప్తాహ

నారాయణఖేడ్: మండల పరిధిలోని బాణాపూర్‌లో రుక్మిణీపాండురంగస్వామి ఆలయంలో గురువారం ఐదో రోజున సప్తాహ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రెండు బైక్‌లు ఢీ ఇద్దరికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి లింగోజిగూడ గ్రామ శివారు నర్సాపూర్– వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై గురువారం జరిగింది. పిల్లుట్ల గ్రామానికి చెందిన రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనగా గాడ్ల కుమార్, పెద్దగొని నర్సింలుకు గాయాలు కాగా.. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే సునీతారెడ్డి



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మను గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

### అంగన్‌వాడీ టీచర్ తొలగింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం టోప్యా తండా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రాట్ల భూలిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారని నర్సాపూర్ సీడీపీఓ హేమాభార్గవి అన్నారు. ఇటీవల తండాకు చెందిన నాలుగు నెలల శిశువు మృతికి సంబంధించి, అంగన్‌వాడీ టీచర్ భూలి సహకారం ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో భూలిని అంగన్‌వాడీ టీచర్ విధుల నుండి తొలగించారు.

### ఆందోళనకు సిద్ధమైన రైతులు

పాపన్నపేట(మెదక్): ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు సిద్ధం కాగా, పోలీసులు అడ్డుకున్న సంఘటన గురువారం సాయంత్రం మిన్‌పూర్‌లో చోటు చేసుకుంది.

# ఆలయాల అభివృద్ధికి సహకారం

**ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షుడు మనోహర్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 22వ తేదీన జరిగే హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో గూడెం మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు విరూపాక్ష, కంకర్ శ్రీను, విజయ్, ప్రసాద్ రమేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ గాయత్రీదేవి

నారాయణఖేడ్: గ్రామీణ ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రిదేవి ఆదేశించారు. నారాయణఖేడ్‌లో పల్లె దవాఖానా డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బందితో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మలేరియా, లెప్రసీ, డెంగీ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో దోమల నివారణకు పంచాయతీల ద్వారా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్భిణుల నమోదును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.సంధ్యారాణి, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డా.మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేశ్‌బాబు

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కలిపించాలని ఎంపీడీఓ రమేశ్ బాబు సూచించారు. మండల పరిషత్‌లో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల గురించి కూలీలకు అవగాహన కలిపించాలన్నారు. నర్సరీల ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర కార్యక్రమలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.

# అధ్వానంగా అల్లాదుర్గం మెటల్‌కుంట రోడ్డు



గంగ్వార్ చౌరస్తా వద్ద రోడ్డుపై నిలిచిపోయిన నీరు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అల్లాదుర్గం–మెటల్‌కుంట ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై గుంతలేర్పడి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంగ్వార్, హద్నూర్, రుక్మాపూర్ తదితర గ్రామాల శివారులో రోడ్డుపై బీటీ లేచిపోయి పెద్ద పెద్ద గుంతలేర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు జల్లుల వల్ల గుంతల్లో నీరు నిలబడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. గుంతల్లో నీరు నిలబడటంతో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గంగ్వార్ చౌరస్తా వద్ద గుంతలో నీరు నిలబడి చెరువును తలపిస్తోంది. వేగంగా వెళ్లే వాహనాల వల్ల రోడ్డు పక్క నడిచే బాటసారులపై బురదనీరు పడుతోంది. ఎప్పుడు రద్దీగా ఉండే రోడ్డును బాగు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు పక్కనే డంపులు



జునేగాం గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారం

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణలోపంతో గ్రామంలోని పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. మండల పరిధిలోని జునేగాం గ్రామంలో రోడ్డు పక్కనే చెత్త డంప్‌లు దర్శనమిస్తున్నాయి. ఇంటింటికి చెత్త సేకరణ జరగకపోవటంతో ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడా చెత్త వేస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది.

# 17 నుంచి వేంకటేశ్వర దేవస్థాన స్వర్ణోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, డైరెక్టర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర దేవస్థానం స్వర్ణోత్సవాలు 17 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథశర్మ, చైర్మన్ టీవీ అమరేశ్ విష్ణు తెలిపారు. మోహిన్‌పుర వేంకటేశ్వర ఆలయ ఆవరణలో స్వర్ణోత్సవ కరపత్రాన్ని గురువారం వారు ఆలయ డైరెక్టర్లు దాస శ్రీనివాస్, పన్యాల మనోహర్ రెడ్డి, పూజల బాలకృష్ణ, బుక్క గోపి, మక్క బాబు, బైరి నాగమణి, శ్రీనివాస్, నవీన్, సంతోష, బాలరాజు, ఉమా వేంకటేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 17 నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మల్క కొమురయ్య, అంజిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య హాజరుకానున్నట్లు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**ఎంపీ రఘునందన్‌రావు**

ములుగు(గజ్వేల్): కార్యకర్తలు కలసికట్టుగా పని చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని వంటిమామిడిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పాలనపై విసుగు చెందిన ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోనే బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని రికార్డును సృష్టించబోతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.